కథా నిలయం
శ్రీకాకుళం

చదరంగం

ఆ ఊరు పల్లె గాదు. ఆ ఊరులోనూ చెట్లు చేమలుతోపాటు ఆవులు, కుక్కలు, నక్కలుతోపాటు మనుషులున్నారు. మనుషులున్నారు కనుక పాలించడానికి ప్రభువులుండాలి కనుక ఆ ఊళ్ళోనూ ప్రభువులున్నారు. కనుక పార్టీలు, కక్షలు, కొట్లాటలు, వైషమ్యాలు తప్పవు గనుక అవీ వున్నాయి.

ఆ ఊరికి మిగతా ఊర్లతోపాటు ఎన్నికలొచ్చాయి పార్టీలు బయలుదేరాయి. హడావిడి వచ్చింది. మిగతా పార్టీలమాట ఎలావున్నా ఆ ఊర్లో చిన్నపరెడ్డి, బాపయ్యనాడు ఎదురెదురుగా పోటీపడ్తున్న పార్టీ ముఖ్యమైంది.

ఆఊర్లో బాపయ్యనాయుడు, చిన్నపరెడ్డి ఇద్దరూ సమబలులే. ఇద్దరూ ఊరికి ముఖ్యులే. అంగబలం, అర్థబలం సరిసమానంగా ఉన్న వాళ్ళే. ఇద్దరి కిద్దరూ రాజకీయపు ఎత్తులు, పై ఎత్తులు తెలిసినవారే.

అంచేత వారిద్దరిలో ఎవరు నెగ్గుతారు అన్న విషయం గురించి ఊర్లో ప్రజలు ఊహాగానాలు, చర్చలు ఆరంభించారు. ఊరు ఊరంతా వారిద్దరి పోటీ ఫలితాల గురించి ఆరాటంగా నిరీక్షిస్తుంది.

బాపయ్య నాయుడు నాలుగురోజుల క్రిందటే రంగంలోకి దూకాడు. పురాణా లేమిటి, హరికథలేమిటి, ఇంటింటికి కాన్వాసింగు ప్రారంభించాడు. నోట్లకట్టలు శనగపప్పు బెల్లాలు మాదిరి పంచిపెడుతున్నాడు. సీసాలకొద్ది సారాయి రోడ్లమీదే పారుతూంది. దొరికినంతవరకు నోట్లు కొనాలన్న ఆరాటంతో బీద ప్రజానీకం గుమ్మాల ముందే చేతులు చాపుకుని కూర్చున్నాడు.

చిన్నపరెడ్డి రంగంలోకి దుమకలే దేమిటని అందరూ చూస్తున్నారు. అలాంటి సమయంలోనే ఆయన కుడిభుజం అయిన కోటిగాడి హత్య వార్త.

తెల్లారేసరికి కోటిగాడి హత్య వార్త ఊరంతా పాకింది. అప్పుడే నిద్రలేచి వీధరుగు మీద పందుల పుల్ల నములుతున్న చిన్నపరెడ్డికి పాలేరు వాడు పరిగెత్తుతూ వచ్చి కోటిగాడి హత్య వార్త అందించాడు. చిన్నపరెడ్డి ఒక్క క్షణం నోటమాట రాక స్థాణువై అలా వుండిపోయి ఆ తరువాత 'ఆ' అంటూ ఒక్క కేకపెట్టి చేతులో పందుం పుల్ల పారేసి పంచె ఎగలాక్కుంటూ వున్నవాడున్నట్టే పరుగెత్తాడు వీధిలోంచే.

కోటిగాడి శవం చుట్టూ అప్పటికప్పుడే పెద్ద గుంపు తయారయింది. ఊరవతల చెరువు గట్టున కోటిగాడు ఘోరంగా హత్య చేయబడ్డాడు. తల మీద ఏ గునపం తోటో పొడిచినట్టుంది. బుర్ర చితికిపోయి నెత్తురు వరదలై గడ్డకట్టింది. మొహం అంతా కారి గడ్డ కట్టింది. కనుగుడ్లు వెళ్ళు కొచ్చి భయంకరంగా వుంది మొహం. గోలు గోలున మొగుడి శవంమీద పడి మాలచ్చి గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది. గుంపుని త్రోసుకుని, దారి చేసుకుని ముందుకెళ్ళి పడ్డాడు చిన్నపరెడ్డి రొప్పుతూ. కోటిగాడిని ఆ స్థితిలో చూశాక ఒక క్షణం అలా స్థాణువులా నిలబడి ఆ తర్వాత 'కోటిగా' అంటూ అంత మనిషి చేతుల్లో మొహం కప్పుకుని క్రింద కూలబడిపోయాడు.

కోటిగాడు చిన్నపరెడ్డికి నమ్మినబంటు. కుడిభుజం, మంత్రి, సలహాదారు అన్న సంగతి ఊరందరికీ తెలుసు. అంచేత చిన్నపరెడ్డి అంతవాడు కోడిగాడి లాంటి వాడి కోసం విచారించడం వింత అన్పించలేదు ఎవరికీ. చచ్చిపోయిన కోటిగాడి వంక జాలిగా, రెడ్డివంక సానుభూతిగా చూశారు.

ఓ ఐదు నిమిషాలు గడిచాక తలెత్తాడు. ఈసారి అతని కళ్ళలో దుఃఖానికి బదులు క్రోధం చోటు చేసుకుంది. మూడో కన్ను విప్పిన శివుడిలా వున్నాడు.

'ఎవరూ ఇంత ఘోరం సేసారు? ఏ ఎదవలురా నా కోటిగాడ్ని యింత దారుణంగా సంపేరు? అన్నెం పున్నెం ఎరుగని నా కోటిగాడ్ని సంపిన ఎదవలెవరో వాళ్ళు నట్టుకుని మూడు సెరువులు నీళ్ళు తాగించక పోతే నా పేరు సిన్నపరెడ్డి కాదు' అంటూ భీకరంగా ప్రతిజ్ఞ చేశాడు.

'నామీద కోపం కసి ఉంటే నా మీద తీర్చుకోవాలి. అంతేకాని ఏ పాపం ఎరుగని కోటిగాడేం సేసాడని ఆడ్ని సంపాల... ఆడు నా మనసవడమా ఆడి అపరాధం. ఆడు నా మనిషి, గూడెంకి నాయకుడు ఆడి మూలకంగా గూడెం ఓట్లన్నీ నా

కొస్తాయనీ అడ్ని సంపేత్తే గొడవుండదని ఇంత ఘోరం సేస్తారా? చావుంటే బలా బలాలు తేల్చుకోవాలగాని ఇలా మడిసిని అన్నాయంగా సంపేత్తారా.

"ఓట్ల కోసం, పదవుల కోసం నిండు ప్రాణాన్ని యిలా ఘోరంగా తీయడం మడుసులు సేసేపనేనా.... కోడిగాడ్ని సంపిందెవరో, ఎక్కడున్నా పట్టుకుని ఉరిశిక్ష వేయించిందాకా నేను నిద్రపోను" మళ్ళీ భీకరంగా ప్రతిజ్ఞ చేశాడు.

అప్పటిదాకా అక్కడున్న గుంపు అందరూ కోడిగాడి హత్య గురించి రకరకాలుగా అనుకున్నారు. ఎవరు చంపి వుంటారన్న విషయం ఊహాగానాలు చేశారు. యిప్పుడు చిన్నపరెడ్డి మాటలు విన్నాక వాళ్ళ సందేహం తీరిపోయినట్లయి అందరూ ఆశ్చర్యంగా గుండెలమీద చేతులు వేసుకున్నారు.

"ఏటి, ఇది బాపయ్యనాయుడి పనా!"

"ఓట్ల కోసం యింత ఘోరం సేసాడా? ఓరి నాయనో మనిషిని సంపేయడమే ఓట్లకోసం!"

"కలికాలం మహాప్రభో... ఎంతకి తెగించారో" ఇంతకీ బాపయ్య నాయుడే చేయించాడని ఏముంది?" అంతా తలోమాట అనుకున్నాడు. చిన్నపరెడ్డి అందరివంక చూశాడు.

మీకింకా సందేహం ఏమిటి? ఇది బాపయ్య నాయుడు పని కాక పోతే మరెవరి పనయ్యా, సీమకైనా అపకారం సెయ్యని కోటిగాడ్ని సంపేయడానికి ఎవరి కవుసరం వుందయ్యా. అడు నా మనిషి. ఆడి మూలకంగా గూడెం ఓట్లన్నీ నాకేస్తారు. అడ్ని సంపేసి, డబ్బాశ చూపించి ఆళ్ళందరిని అటు తిప్పుకోవచ్చని ప్లానేసాడు. యింత ఘోరం సేసాడు విడమర్చాడు.

అందరూ వప్పుకున్నట్టు తలలాడించారు. "యింత పని సేసిన ఆళ్ళని పట్టుకుని పోలీసుల కప్పగించందే నేనూరుకోను. ఒరే పోలిగా, గమ్మున పోలీసు స్టేషనుకి పరిగెట్టి యిక్కడ హత్య జరిగిందని ఇన్‌స్పెక్టరుని వెంట బెట్టుకురా, ఆ ... ఆ తోవనే మన ప్రెసు రిపోర్టరు మూర్తి బాబుని కూడ వెంటబెట్టుకురా... యీ దగుల్బాజీల పని పేపర్లో ఏయించి లోకానికి సెప్పాల..." కోపంతో వణికి పోతూ అన్నాడు రెడ్డి పోలిగాడు పరిగెత్తాడు.

కాస్త కోపం దుఃఖం సర్దుకున్నాక మొగుడి శవం మీద పడి హృదయ విదారకంగా ఏడుస్తున్న లచ్చి దగ్గిరకి వెళ్ళి నిలబడ్డాడు రెడ్డి. కామందుని చూసి మరింత శోకాలు

పెట్టసాగింది లచ్చి. "ఓరి నాయనో ఓరి దేముడో, నానే సెర్లో పడనో దేముడో, నాకేటి దిక్కోర్రో, నేనేం సేతునే నన్నన్యాయం సేసినోడో దేముడో" ఏడుస్తున్న లచ్చి వంక జాలిగా చూసి పై పంచతో కళ్ళొత్తుకున్నాడు రెడ్డి.

'ఊరుకో లచ్చీ... వూరుకో... యింక ఏడ్చి లాభం ఏటి? సూడు... నీ మొగుడ్నంటే నీకు తెచ్చి యియలేనుగానీ నీకు, నీ పిల్లలకి ఏలోటు రాకుండా నే సూత్తానుగా... ఏడవకు' అంటూ ఓదార్చాడు.

అరగంటలో పోలీసు ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. చిన్నపరెడ్డి ముందుకువెళ్ళి సంగతంతా విశదీకరించి తన అనుమానం వివరించాడు. ఈ కేసుని ఆషామాషీగా తీసుకుని వదిలేయకూడదని, తన స్వంత కేసనుకుని ప్రయత్నించి హంతకులని పట్టుకోవాలని చెప్పాడు. ఇన్‌స్పెక్టరు అంతా విన్నాడు. చుట్టూ ఉన్న మనుష్యులనీ ప్రశ్నించాడు. పోలీసు ఫోటో గ్రాఫరు ఫోటోలు తీసుకుంటున్నాడు. అసలు అంత ఉదయాన్నే చెరువు గట్టుకి ఎందుకు వెళ్ళాడని ప్రశ్నించాడు.

"రోజూ సీకట్నే ఆడు సెరువుగట్టుకాడకి బయలు కెడతాడు బాబూ! అట్నించొచ్చి గంజి తాగి బాబుగారింటికి పనికెల్తాడు. ఈ పొద్దు సెరువుగట్టు కాడ కెళ్ళినాడు ఎంతకీ రాకపోతే అట్నించటే బాబుగారింటికెళ్ళి పోనాడనుకున్నాను... గానీ యింత ఘోరం జరిగి పోనా దనుకోలేదు" లచ్చిమళ్ళీ గొల్లుమంది.

ఇన్‌స్పెక్టరు వివరాలన్నీ రాసుకుని బాపయ్య నాయుడిని కలవడానికి బయలుదేరాడు.

శవపరీక్ష ముగిశాక పోలీసులు శవం అప్పగించాక చిన్నపరెడ్డి పెద్ద ఎత్తున ఆర్భాటంగా కోటిగాడి శవాన్ని దహనం చేయడానికి దగ్గిరుండి అన్ని ఏర్పాటులు చేశాడు. లారీ తెప్పించి పూలదండలు కట్టించాడు. కోటిగాడి శవంమీద పూలు జల్లాడు. ఊరంతా ఊరేగించి దగ్గిరుండి మరీ దహనం చేయించి కోటిగాడి మీద తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు.

* * * * * *

పోలీసు ఇన్‌స్పెక్టరు బాపయ్యనాయుడి దగ్గరికి వచ్చే లోపలే ఆయన అనుచరులు కోటిగాడి హత్య వార్త అందించేశారు. చిన్నపరెడ్డి అన్న మాటలన్నీ పొల్లుపోకుండా చెప్పారు. ఆ మాటలు విన్న నాయుడు మొహం చిట్లించాడు.

"ఏటి, మనం సంపింసినాం అంటున్నారా? ఏడిశాడు ఎదవ. కూసుకోనీ మనకేటి నట్టం? మనం సంపడం ఆడు సూశాడా? సాచ్చికం ఏదన్నా సూపమను లంజి కొడుకిని. ఆడేమాటంటే అదే రైటా ఏటి? ఆడి మాటే సెల్లిపోతాదనుకుంటున్నాడు గామోసు... ఆడు, నేను మాటంటే సెల్లిపోదు కోర్టులో... సాచ్చికం వుండాలి సాచ్చ్యం" అంటూ కోపంగా కొంతసేపు, నిర్లక్ష్యంగా కొంతసేపు మాట్లాడాడు.

ఇన్‌స్పెక్టరు వచ్చి అడిగినా అదే చెప్పాడు. ఆడి మాట లట్టుకుని అనవసరంగా నామీద నేరం ఎట్టారంటే నేనసలే మంచోడ్నిగాను. జాగ్రత్త, మీపని సెపుతాను. పరువునట్టం దావా ఏస్తాను. ఆ ఎదవ ఏదో కూసినంత మాత్రాన ఆడి మాటలట్టుకుని నాకాడకి వస్తారా... నేనే సేసాననడానికి సాచ్చ్యం వుంటే సూపండి ఆడు మీరు! అంటూ దులిపి వెళ్ళాడు.

ఇన్‌స్పెక్టరు ఏం చెయ్యాలో తెలియక బుర్ర గీక్కున్నాడు. ఆఖరికి ఆలోచించి బాప్యయ నాయుడి పార్టీలో జమా జెట్టీలలాంటి ఇద్దర్ని అనుమానితులుగా అరెస్ట్ చేసి తీసుకెళ్ళాడు.

* * * * * *

కోటిగాడు చనిపోయిన పదకొండో రోజున ఊర్లో కోటిగాడి ఆత్మ శాంతికి సంతాప సభ జరిపించాడు రెడ్డి. అతని ఆత్మ శాంతికి ప్రార్థనలు చేశాడు. అన్నమాట ప్రకారం కోటిగాడి పెళ్ళానికి వెయ్యి రూపాయలు ఇచ్చాడు. గుడిసె వేసుకోడానికి డబ్బిచ్చాడు. కోటిగాడి కొడుక్కి ఎవరితోనో చెప్పి బంట్రోతు పని వేయిస్తానన్నాడు.

చెప్పినవన్నీ చేసి మాట నిలబెట్టుకుని కోటిగాడి మీద తనకున్న అభిమానంతోపాటు అతని దయార్ద్ర హృదయాన్ని కూడా చాటుకుని నలుగురిచేత ఔననిపించుకున్నాడు రెడ్డి.

* * * * * *

ఎలక్షన్లు వచ్చాయి... వెళ్ళాయి.

పాతికవేలు ఖర్చుపెట్టిన బాపయ్య నాయుడు చిత్తుగా ఓడిపోయాడు. మూడువేలు మాత్రం ఖర్చు పెట్టిన చిన్నపరెడ్డి ఘనవిజయం సాధించాడు.

కోటిగాడి హత్యకేసు కాలగర్భంలో కలిసిపోసాగింది.

* * * * * *

విజయోత్సాహంతో మెడలో పూలదండలతో అభిమానుల, ఆప్తుల అభినందనలు అందుకుని, ఆనందంగా గర్వంగా యింట్లోకి అడుగుపెట్టిన చిన్నపరెడ్డి లోపల వరండాలో కూర్చున్న వీరిగాడ్ని చూడగానే ఆయన మొహం అంతవరకు పెట్రోమాక్సు లైటులా వెలుగుతున్నదల్లా ఆముదం దీపంలా మారిపోయింది. నుదురు చిట్లించి తీక్షణంగా చూశాడు.

వీరిగాడు ముసిముసి నవ్వు నవ్వుతూ దండం పెట్టాడు.

"ఏరా ఇలా వచ్చావు?" అన్నాడు పళ్ళబిగువున రెడ్డి.

"ఓసారి తమ దర్శనం చేసుకుందావని, తవరు ఎలచ్చన్లో నెగ్గారు గందా అని... " అంటూ వెకిలి నవ్వు నవ్వాడు.

"ఊ... చూశావుగా... యింక వెళ్ళు" కఠినంగా అన్నాడు.

"దొరా!" నసుగుతూ బుర్ర గోక్కున్నాడు వీరిగాడు.

"ఊ... ఏమిటి?" తీక్షణంగా చూశాడాయన.

"దొరా, యింట్లో చాలా కష్టంగా ఉంది. జరుగుబాటు... ఏదన్నా యిప్పించాలి దొరా" అన్నాడు.

"ఇచ్చాగా, ఇంకా ఏమిటి?"

"అది సరే దొరా, కష్టం చాలదు దొరా.. ప్రాణాలకి తెగించి, మూడో కంటివాడికి తెలియకుండా..."

"వీరిగా!" మధ్యలోనే గర్జించాడాయన. "నోర్మూయ్ చంపేస్తాను నోరెత్తావంటే" మధ్యలోనే అరిచాడు. కాసేపు తీక్షణంగా వీరిగాడ్ని చూస్తూ ఆలోచించి లోపలికి వెళ్ళి, అంతలోనే తిరిగి వచ్చాడు రెడ్డి. చేతిలో ఉన్న ఐదు పచ్చనోట్లు వీరిగాడి చేతిలోపెడుతూ మింగేసేట్టు చూశాడు.

"ఒరేయ్ వీరిగా, నోరెత్తి మరోమాట మాట్లాడావంటే చంపేస్తాను.

ఈ సంగతి మూడో మనిషికి తెలిసిందన్న సంగతి నాకు తెలిస్తే ఆ రోజుతో నీ చావు మూడిందన్న సంగతి గుర్తుంచుకో!... ఈవంకతో మళ్ళీ ఈ ఇంటి గుమ్మం తొక్కితే నీకు భూమ్మీద నూకలు నిండుకున్నాయన్న విషయం తెలుసుకో. పిచ్చిపిచ్చి వేషాలు వేద్దామనుకుంటున్నట్టున్నావు గాబోలు ఈ సాకు అడ్డం పెట్టుకుని. నేనెవరో తెల్సుగా. జాగ్రత్త. వెళ్ళిక్కడనించి.. మళ్ళీ నాకంటికి కనిపించకుండా.. పో...

ముందు..!" కోపంతో వణికిపోతూ వేలుపెట్టి గుమ్మం చూపించాడు రెడ్డి.

వీరిగాడు ఆ కోపానికి బెదరకుండా, నక్క వినయం చూపిస్తూ, వంగి దండం పెడ్తూ... 'నాకు తెల్దా దొరా తమ సంగతి' అంటూ ఓనవ్వు విసిరి వెళ్ళిపోయాడు బయటికి.

*(స్నేహ మాసపత్రిక - **1975** ప్రాంతం)*